ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 2 | సంచిక: 30 | పేజీలు: 4 | వెల: రూ.3/- | శుక్రవారం 10 మే 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్



## పద్మవిభూషణుడు మన చిరంజీవి

**రాష్ట్రపతి చేతుల మీదుగా పురస్కారం**
**అట్టహాసంగా పద్మ పురస్కారాలు**
**చిరుకు పలువురు ప్రశంసలు**

న్యూఢిల్లీ, మే 9 (ప్రభాత ఉదయం): మెగాస్టార్ చిరంజీవి దేశంలోని రెండో అత్యున్నత పురస్కారం పద్మ విభూషణ్ అందుకున్నారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ అవార్డును చిరంజీవికి అందించారు. చిరంజీవితో పాటుగా పలువురు పద్మ అవార్డులు అందుకున్నారు. కళారంగానికి అందించిన సేవలకు గుర్తింపుగా చిరంజీవికి పద్మ విభూషణ్ పురస్కారం లభించింది. ఈ కార్యక్రమంలో చిరంజీవి సతీమణి ..మిగతా 2లో

## నాలుగో విడత ఎన్నికలకు సమీపిస్తున్న గడువు

**13న దేశవ్యాప్తంగా నాలుగో విడత ఎన్నికలు**
**11న సాయంత్రం ముగియనున్న ప్రచారం**
**ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు ఇసి ఏర్పాట్లు**
**ఎపిలో సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక ఫోకస్**

న్యూఢిల్లీ, మే 9 (ప్రభాత ఉదయం): దేశవ్యాప్తంగా నాలుగో దశ సార్వత్రిక ఎన్నికలకు గడువు దగ్గర పడింది. మే13న నాలుగో విడత ఎన్నికలు జరుగగనున్నాయి. ఇందులో ఉబయ తెలుగు రాష్ట్రాలు కూడా ఉన్నాయి. ఎపిలో పార్లమెంటుతో పాటు అసెంబ్లీకి కూడా ఎన్నికలు జరుగబోతున్నాయి. ఇందుకోసం పార్టీలు హోరా హోరీగా ప్రచారం నిర్వహిస్తున్నాయి. శనివారం 11వ తేదీ ..మిగతా 2లో



# ప్రతి మహిళ ఖాతాలో రూ.లక్ష

**మోడీ దోచిన సొమ్ముతో పేదలకు పంచుతాం**
**ఆదానీ అంబానీలకు దోచిపెట్టిన మోడీ**
**నిరుద్యోగులకు 8500 భృతి కల్పిస్తాం**
**ఉపాధి కూలీని 400కు పెంచుతాం**
**సరూర్‌నగర్ జనజాతర సభలో రాహుల్**



హైదరాబాద్, మే 9 (ప్రభాత ఉదయం): ప్రస్తుత ఎన్నికలు రెండు సమూహాల మధ్య జరుగుతున్నాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. ఓ వర్గం రాజ్యాంగాన్ని రక్షించాలనుకుంటుంటే.. మరో సమూహం రాజ్యాంగం అవసరం లేదు, రద్దు చేస్తామని చెబుతోందని విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా హైదరాబాద్ సరూర్ నగర్‌లో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ జనజాతర సభలో రాహుల్ ప్రసంగించారు. విద్య, ఉద్యోగాలు, ఓటు హక్కు.. ఇలా అన్నీ రాజ్యాంగం ద్వారానే వచ్చాయని, అలాంటి రాజ్యాంగంతోపాటు రిజర్వేషన్లను కూడా రద్దు చేయాలని భాజపా కుట్ర చేస్తోందని ఆరోపించారు. మహామహా మేధావులు ఏళ్ల తరబడి కృషి చేసి దేశానికి రాజ్యాంగం అందించారు. ఎంతో గొప్పదైన మన రాజ్యాంగాన్ని మారుస్తామని భాజపా నేతలు చెబుతున్నారు. అందుకే ప్రభుత్వరంగ సంస్థలను విక్రయిస్తున్నారు. రాజ్యాంగంతో పాటు రిజర్వేషన్లు కూడా రద్దు చేయాలని బీజేపీ కుట్ర చేస్తోందని, దాన్ని అడ్డుకుని తీరుతామని రాహుల్‌గాంధీ అన్నారు. రాజ్యాంగం అనేది భారతీయుల ఆత్మ అని...అలాంటి రాజ్యాంగాన్ని బీజేపీ నేతలు మార్చుతామని అంటున్నారని చెప్పారు. రిజర్వేషన్లను రద్దు చేసేందుకే ప్రభుత్వరంగ సంస్థలను విక్రయిస్తున్నారన్నారు. రాజ్యాంగాన్ని కాపాడే బాధ్యత కాంగ్రెస్ పైన ..మిగతా 2లో



## ఏమీ చేయని బీజేపీకి ఎందుకు ఓటేయాలి?

**మోదీ పాలన వల్ల ప్రమాదంలో రాజ్యాంగం**
**రాజ్యాంగ రక్షణకు నడుం బిగించిన కాంగ్రెస్**
**గాడిద గుడ్డు ఇచ్చిన మోడీకి బుద్ధి చెప్పాలి**
**ఏమీ చేయని బిజెపికి ఎందుకు ఓటేయాలి**
**ప్రజలంతా కాంగ్రెస్ వెంట నడవాలన్న రేవంత్**

హైదరాబాద్, మే 9 (ప్రభాత ఉదయం): మోదీ పాలన వల్ల రాజ్యాంగం ప్రమాదంలో పడిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. రాజ్యాంగం, రిజర్వేషన్ల రక్షణ కోసం కాంగ్రెస్ పోరాడుతోందన్నారు. ఇందుకు ప్రజలు మద్దతు తెలపాలన్నారు. తెలంగాణకు గాడిదగుడ్డు ఇచ్చిన మోడీని ఓడించాలన్నారు. గత పదేళ్లుగా ఏమీ చేయని మోడీకి మరోమారు ఎందుకు ఓటేయాలని అన్నారు. సరూర్ నగర్ స్టేడియంలో జరిగిన జనజాతర భారీ బహిరంగ సభలో రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి, ఇన్‌చార్జి దీపా దాస్ మున్షీ, తెలంగాణ జన సమితి అధ్యక్షుడు కోదండరాం, చేవెళ్ల అభ్యర్థి రంజిత్ రెడ్డి, మల్కాజ్ గిరి పార్లమెంట్ అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సభలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ ఎన్నికలు మన జీవన్మరణ సమస్య అని చెప్పుకొచ్చారు. తాము ఇచ్చిన రిజర్వేషన్లు రద్దు చేయాలని బీజేపీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. రిజర్వేషన్లపై దాడి చేయాలని మోదీ, అమిత్ షా కంకణం కట్టుకున్నారని మండిపడ్డారు. రాజ్యాంగం సంక్షోభంలో పడే సమయంలో ఇందిరాగాంధీ మెదక్ నుంచి పోటీ చేశారని గుర్తుచేశారు. ఇందిరా మనమడు, సోనియా కొడుకు రాహుల్ గాంధీ రాజ్యాంగం కాపాడడానికి తెలంగాణ గడ్డపైకి వచ్చి యుద్ధం ప్రకటించారని అన్నారు. తెలంగాణ బిడ్డలు రాహుల్ గాంధీ వైపు నిలబడాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. రిజర్వేషన్లు కాపాడే పోరాటంలో మనమంతా రాహుల్‌తో కలిసి నడవాలి. 15 సెకన్ల సమయం ఇస్తే ముస్లింలను తుదముట్టిస్తామని బీజేపీ ఎంపీ అంటోంది. మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు మత సామరస్యం పెంపొందించాం కాబట్టే వేల కోట్ల పెట్టుబడులు హైదారాబాద్‌కి వచ్చాయి. మతాన్ని రెచ్చగొట్టి రాజకీయ లబ్ది పొందాలని బీజేపీ చేస్తున్న ప్రయత్నం తిప్పికొట్టాలి. విశ్వనగరంలో బీజేపీ విషం చిమ్ముతోంది. శ్రీరామనవమి, హనుమాన్ జయంతి మనం చేయలేదా? మనకా వీళ్ళు హిందుత్వం నేర్పేది?.అక్షింతలు పంపి ఓట్ల బిచ్చం ఎత్తుకునేందుకు బీజేపీ ప్రయత్నం చేస్తోంది. బీజేపీ మత ఉచ్చులో పడకండి.15 సెకన్లలో ముస్లింలను తుదముట్టిస్తామని చెప్పిన బీజేపీ ఎంపీ పై అమిత్ షా, మోదీ స్టాండ్ ఏంటో చెప్పాలి. మోదీ తెలంగాణకు గాడిద గుడ్డు ఇచ్చాడు అని రేవంత్‌రెడ్డి మాస్ సెటైర్లు విసిరారు.



## బూటకపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్

**ఆరు గ్యారెంటీలు..420 హామీలు**
**ఇచ్చిన హామీల్లో ఫ్రీ బస్సు మాత్రమే అమలు**
**గోదావరి చుట్టూ జలధారలు నిర్మిస్తే మాయం చేశారు**
**రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు వచ్చాయ్**
**రెప్పపాటు పోకుండా ఇచ్చిన కారెంట్ కూడా మాయం**
**ఎన్నికల తరవాత ఈ ప్రభుత్వం ఉంటుందో ఊడుతుందో..**
**కరీంనగర్ ప్రచారంలో కేసీఆర్ విసుర్లు..విమర్శలు**

కరీంనగర్, మే 9 (ప్రభాత ఉదయం): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో చెప్పినవన్నీ బూటకపు హామీలు అని.. అరచేతిలో వైకుంఠం చూపించారని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలిపారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా చేపట్టిన బస్సు యాత్రలో భాగంగా కరీంనగర్ పట్టణంలో పర్యటించిన కేసీఆర్.. కాంగ్రెస్ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలతో మోసం చేసిందని మండిపడ్డారు. రైతుబంధు కింద రూ.15వేలు ఇస్తామని చెప్పారని.. ఇవ్వకుండా దోఖా చేశారని.. మేం రెండు వేల పింఛన్ ఇస్తే 4 వేలు ఇస్తామని చెప్పి దోఖా చేసింద్రు ..మిగతా 2లో

## భైంసాలో కేటీఆర్‌కు చేదు అనుభవం

**రోడ్‌షోలో టమాటాలు, గుడ్లతో దాడి**



నిర్మల్, మే 9 (ప్రభాత ఉదయం): తెలంగాణలో ఎన్నికల పోలింగ్‌కు మరో నాలుగు రోజులు మాత్రమే సమయం ఉండటంతో.. ప్రధాన పార్టీలు ప్రచారంతో హోరెత్తిస్తున్నాయి. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ అగ్రనాయకత్వం ప్రచారం దూసుకెళ్తుంది. బుధవారం నిర్మల్ జిల్లాలోని భైంసాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు రోడ్ షో నిర్వహించారు. ఈ రోడ్ షో లో అనుకోని పరిణామం ఎదురైంది. ఒక్కసారిగా కేటీఆర్‌పై ఆందోళనకారులు విరుచుకుపడ్డారు. కేటీఆర్ ప్రసంగిస్తుండగా టమాటోలు, ఉల్లి గడ్డలు ఆందోళన కారులు విసిరారు. ఆందోళన కారులను పోలీసులు,సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. ప్రసంగం ముగించుకొని నిర్మల్‌కు కేటీఆర్ బయలు దేరారు. రాముని గుడి కడితే బీజేపీకి లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేయాలా అని మాజీ మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. అలా అంటే మాజీ సీఎం కేసీఆర్ కూడా యాదాద్రి ఆలయాన్ని ..మిగతా 2లో



## మెదక్‌లో వెంకట్రామిరెడ్డిదే విజయం

**రెండు, మూడో స్థానాలకు కాంగ్రెస్, బిజెపి పోటీ**
**బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ధీమా**

2

## రాహుల్ పిల్ల చేష్టలు..మోడీ గ్యారెంటీల మధ్య పోటీ



**కాంగ్రెస్ పరిస్థితి దయనీయంగా ఉంది**
**తెలంగాణలో 10సీట్లకు పైగానే గెలుస్తున్నాం**
**భువనగిరి సభలో అమిత్ షా విమర్శలు**

భువనగిరి, మే 9 (ప్రభాత ఉదయం): రాహుల్ పిల్ల చేష్టల గ్యారంటీలు.. మోదీ గ్యారంటీల మధ్య జరుగుతున్న ఎన్నికలివని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. కాంగ్రెస్ పరిస్థితి దయనీయంగా తయారైందని, ఆ పార్టీ తరఫున పోటీ చేసేందుకు అభ్యర్థులు కూడా దొరకట్లేదని ఎద్దేవా చేశారు. మోదీ ఏం చెబుతారో దానిని తప్పకుండా చేస్తారని, రాహుల్ ఇచ్చిన గ్యారంటీలు అమలయ్యే పరిస్థితి లేదని ..మిగతా 2లో

# బూటకపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్

మొదటి పేజీ తరువాయి...

అని మండిపడ్డారు. మేం ఇచ్చిన వాటికి డబుల్, త్రిబుల్ ఇస్తామని చెప్పి ప్రజలను మోసగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు 5 లక్షల గ్యారంటీ కార్డు ఇస్తామన్నారు.. ఎవరికైనా ఇచ్చిండ్రా అని ప్రశ్నించారు. ఇచ్చిన హామీల్లో మహిళలకు ఫ్రీ బస్సు మాత్రం నెరవేర్చారని కేసీఆర్ అన్నారు. ఈ స్కీమ్‌తో ఆటో డ్రైవర్లు రోడ్డున పడ్డారని అన్నారు.గోదావరి నిండా బ్యారేజిలు కట్టి అమృతధారల్లాంటి నాలుగు జలధారలను ఈ కరీంనగర్ చుట్టూ నిర్మించామని కేసీఆర్ తెలిపారు. కానీ అవన్నీ ఇవాళ మాయమైనయని అన్నారు. మళ్లీ ఊళ్లళ్లకు బోరుబండ్లు వస్తున్నాయని.. పూడికలు తీసే క్రేన్లు వస్తున్నాయని.. రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు వచ్చినయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతకాలం ఉన్న కరెంటు ఎక్కడికిపోయిందని ప్రశ్నించారు. రెప్పపాటు కూడా పోకుండా తొమ్మిదేండ్లు కరెంటు ఇచ్చామని.. ఇప్పుడు ఎటు పోయిందని నిలదీశారు. మిషన్ భగీరథ నీళ్లు ఎక్కడికి పోయినయని ప్రశ్నించారు. మళ్లీ బిందెలు పట్టుకుని పోవడం, ట్యాంకర్లు రావడం, చూస్తుంటే నాకే కండ్లళ్లకు నీళ్లు వస్తున్నాయి.. ఇవన్నీ చూస్తుంటే చాలా బాధ కలగుతుందని భావోద్వేగానికి గురయ్యారు. కరెంటు ఎక్కడికిపోయింది.. మంచినీళ్లు ఎక్కడికి పోయినయ్.. ఇదేం దుస్థితి. ఏం దౌర్భాగ్యం.. ఈ పరిస్థితి ఎందుకొచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగైదు నెలల్లోనే ఇంత ఆగమాగం ఎందుకు అవుతున్నామనేది ఆలోచించాలని ప్రజలకు సూచించారు. రైతుబంధు కింద 15వేలు ఇస్తామని నమ్మబలికి.. ఉన్న 10 వేలు ఇవ్వకుండా దాన్ని కూడా కింద మీద చేసి పరిస్థితి చేస్తున్నారని కేసీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాత ఎమ్మెల్యేలు ఇచ్చిన కల్యాణ లక్ష్మి వస్తుంది తప్ప.. కొత్త చెక్కులు ఇవ్వడం లేదన్నారు. 'మునుపు గరీబోళ్లకు రోగమో, నొప్పి వస్తే ఎమ్మెల్యే దగ్గరికి పోతే సీఎంఆర్ఎఫ్ చెక్కులు వచ్చేవి. ఇవాళ ఒక్క సీఎంఆర్ఎఫ్ చెక్కు కూడా ఇస్తలేరు. రేషన్ కార్డుల మీద సన్నబియ్యం ఇస్తామని చెప్పిండ్రు.. సన్న బియ్యం ఇవ్వట్లేదు. ఏ ఒక్క వాగ్దానం కూడా కాలేదు. అయ్యే పరిస్థితి కూడా లేదు.' అని అన్నారు. పార్లమెంటు ఎన్నికల తర్వాత ఈ ప్రభుత్వం ఉంటదో.. ఊడుతదో.. ఏం జరుగుతదో తెలియదని అన్నారు. ఎమోషనల్ డ్రామాతో పదేళ్లుగా మోదీ నేతృత్వంలోని కేసీఆర్ ప్రభుత్వం ప్రజలను ఫూల్స్ చేస్తుందని బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఆయన కరీంనగర్‌లో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ చౌరస్తాలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతూ.. 'ఈ పార్లమెంట్ ఎన్నికల్లో మూడు పార్టీలు మీ ముందున్నయ్. ఇందులో దేశాన్ని పాలిస్తున్న భారతీయ జనతా పార్టీ మీ ముందున్నది. ఒక్కటే మాట మనవి చేస్తున్న. పదేళ్లనాడు ఈ దేశానికి ప్రధానిమంత్రి అయ్యిండు. దగ్గర దగ్గర 150 హామీలు ఇచ్చిండు. ఏ ఒక్క హామీ అన్న నెరవేర్చిండా? సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ ఏమన్నా అయ్యిందా? దేశ్‌కా సత్యనాశ్ అయ్యింది. అచ్చేదిన్ రాలేదు కానీ.. సచ్చేదిన్ వచ్చినయ్. పెట్రోల్, డీజిల్, ఎరువుల ధరల పెరిగినయ్. పేదలు బతకలేని పరిస్థితి వచ్చింది తప్ప అచ్చేదిన్ రాలేదు. వికసిత్ భారత్ కాలేదు కానీ.. విఫల భారత్ అయ్యింది' అంటూ మండిపడ్డారు. దండంపెట్టి చెబుతున్నా ఆలోచించండి.. మాట్లాడితే పాకిస్తాన్‌ను చూపించాలి. పాకిస్తాన్ చిన్న దేశం. ఒక్క జాపట్ కొడితే 25 ఏళ్లు మన తెరువురాడు. వాణ్ణి చూపించి.. ఓ డ్రామా చేసి.. ఎమోషనల్ డ్రామా చేసి మనల్ని పది సంవత్సరాలు ఫూల్స్ చేస్తున్నరు. అందరూ దయచేసి ఆలోచన చేయాలి. ముఖ్యంగా యువకులు, విద్యావంతులు, మేథావులు, కరీంనగర్ పట్టణంలో, ఈ ప్రాంతంలో ఉన్న రచయితలకు దండంపెట్టి చెబుతున్న.. మోదీ చేసే ఎమోషనల్ బ్లాక్ మెయిల్ క్యారీ అయితే.. ఈ దేశం ఇప్పటికే సర్వనాశనం అయ్యింది. మోదీకన్నా ముందున్న 14 మంది ప్రధానమంత్రులు కేవలం 55లక్షల కోట్ల అప్పు చేస్తే రూ.105లక్షల కోట్ల అప్పు చేసిండు. రూపాయి విలువ పడింది. ఎగుమతులు భారత్ నుంచి నిలిచిపోయాయి. దిగుమతులు భారీగా పెరిగాయి. విదేశీ మారకద్రవ్యం నిలువ తగ్గిపోయినయ్. సంవత్సరానికి 2కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి ఒక్కటీ చేయలేదు. ఏ ఒక్క వర్గానికి దళితులు, గిరిజనులకో, మహిళలకో, పేదలకో, మైనారిటీలకో.. రైతులకో మేలు జరుగలేదు' అని ఆరోపించారు.
ఢిల్లీలో ధర్నా చేస్తే 750 మంది రైతులను మోదీ పొట్టనపట్టుకున్నడు. యూపీలో ఎన్నికలుంటే అదే రైతులకు క్షమాపణలు వేడుకొని.. గ్గటెక్కిండు. ఆయనకు అప్పుడు బిరుదు ఇచ్చారు. మాఫీకా సౌదాగర్ అని చెప్పి. ఈ రకంగా ఆయనకు ఓట్లు అక్కర ఉన్నప్పుడు.. డ్రామాలు, వేషాలు కట్టి ప్రజల మధ్య చీలికలు తెచ్చి.. మతవిద్వేషాలు పెంచి.. ఒకరకమైన ద్వేషపూరిత వాతావరణం నింపుతరు తప్ప బీజేపీ ఎజెండాలో పేదల మాటల ఉండదు. కార్పొరేట్ల కోసం రూ.15లక్షల కోట్ల ప్రజల సొమ్మును బ్యాంకు రుణాలను ఆయన అబ్బసొత్తులా మాఫీ చేసిండు కానీ.. రైతులకు రూపాయి ఇవ్వలేదు. ఎవ్వరికీ మేలు జరుగలేదు. అన్నీ వట్టి డైలాగులు.. డబ్బాలో రాళ్లువేసి ఊపినట్లుగా లొడలొడ ఊపుడు తప్ప ఏ ఒక్కమాట నిజం కాలేదు.
దయచేసి నా మాటను ఆషామాషీగా తీసుకోకుండా మేధావులు, విజ్ఞులు ఆలోచించాలని కోరుతున్నా'నన్నారు కేసీఆర్. దమ్ముంటే చేయగలిగిందే చెప్పాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హితవు పలికారు. రైతుబంధు ఇస్తానని ఎన్నికలప్పుడు చెప్లేదని.. కానీ రైతులకు కావాలని తర్వాత చేశామని చెప్పారు. వడ్లు తడిసిపోయినా కొన్నామని.. రైతు చనిపోతే 5 లక్షల బీమా ఇచ్చామని చెప్పారు. కానీ ఇవాళ దాన్ని కూడా ఊడగొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదెకరాలు దాటినోళ్లకు రైతుబంధు ఇవ్వనని రేవంత్ రెడ్డి అంటున్నారని.. ఆరెకరాలు, ఏడెకరాలు ఉన్నోడు ఏం పాపం చేసిండ్రు అని ప్రశ్నించారు. పొలం దున్నినోళ్లకే రైతుబంధు ఇస్తారంట.. వాళ్లను ఎట్ల గుర్తుపడతావని అడిగారు. రైతుబంధు కావాలంటే మళ్లీ అధికారుల దగ్గరకు పోవాలి.. దున్నినట్టు సర్టిఫికెట్ అడగాలి.. దాని కోసం లంచం ఇవ్వాలి.. అంటే రైతుబందు మొత్తం గోల్‌మాల్ చేసే కుట్రకు ప్రభుత్వం తెరలేపుతుందని మండిపడ్డారు. ' యాదవుల కోసం గొర్రెల పంపిణీ, మత్స్యకారులకు చేపల పంపిణీ పెట్టినం.. అప్పుడు కాంగ్రెస్ నేతలు మమ్మల్ని ఎగతాళి చేసిండ్రు.. కానీ యాదవ సోదరులకు ఎంత మేలు జరిగింది? మత్స్యకారులకు ఎంత మేలు జరిగింది? మేం గొల్ల, యాదవ సోదరులకు రెండు లక్షలు ఇస్తామని చెప్పి గొర్రెల పంపిణీ బంద్ చేసిండ్రు. తక్షణమే డీఏ ఇస్తామని ఉద్యోగులకు చెప్పారు.. నాలుగో డీఏ వచ్చింది తప్ప ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు.. ఇటు ఉద్యోగులను, విద్యార్థులను, రైతులను, యాదవులను, మత్స్యకారులను, దళిత వర్గాల ప్రజలను అందర్నీ మోసం చేసిండ్రు. విద్యార్థులకు గత 5 నెలల నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడం లేదు. 20 లక్షల విదేశీ విద్య నిధి పెడితే స్కాలర్‌షిప్‌లు ఆపేసిండ్రు. పూర్తి నిష్క్రియపరంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది' అని కేసీఆర్ అన్నారు. పైగా రాహుల్‌గాంధీ వచ్చి ప్రతి మహిళకు రూ.2500 ఇస్తున్నామని చెబుతున్నారు. రాహుల్ గాంధీ మాత్రమే కాదు.. కాంగ్రెస్ జాతీయ మహిళా అధ్యక్షురాలు అల్కా లాంబా కూడా ఇదే చెబుతుంది. నారీ శక్తి మీటింగ్ పెట్టి రూ.2500 ఇస్తున్నామని చెబుతుందని తెలిపారు. ఇప్పటికీ మహిళలకు ఒక్క రూపాయి రాలేదు.. వచ్చే పరిస్థితి కూడా లేదని అన్నారు. ఎన్నికల ముందు బెల్ట్ షాపులు రద్దు చేస్తామని చెప్పారని కేసీఆర్ గుర్తు చేశారు. బెల్ట్ షాపులు రద్దు చేయలేదు కానీ మద్యం అమ్మకాలు మాత్రం పెరిగాయని అన్నారు. ముస్లిం మైనార్టీలను కూడా మోసం చేశారని ధ్వజమెత్తారు. కాబట్టి మంచివాళ్లకు ఓటేస్తే మంచి జరుగుతుంది.. మంచి పార్టీ గెలిస్తే మంచి జరగుతుందని విజ్ఞతతో ఆలోచించాలని సూచించారు. ఉద్యమ కార్యకర్త వినోద్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. తన దగ్గర ఉన్న సర్వేల ప్రకారం వినోద్‌కుమార్ ఇప్పటికే 8 శాతం ముందంజలో ఉన్నారని చెప్పారు. వినోద్‌కుమార్ గెలుపు ఇప్పటికే ఖాయమైందని చెప్పారు. ఈ నెల 13వ తేదీ వరకు ఇదే ఆవేశంతో ఉండి.. వినోద్‌కుమార్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

# ప్రతి మహిళ ఖాతాలో రూ.లక్ష

మొదటి పేజీ తరువాయి...

ఉందని చెప్పారు. మోదీ పదేళ్ల పాలనలో 20మంది బడా వ్యాపారులను బిలియనీర్లను చేశారని విమర్శించారు రాహుల్. మోదీ గత పదేళ్లుగా దేశ సంపదనంతా అంబానీ, అదానీల చేతిలో పెట్టారన్నారు. మోదీ గత పదేళ్లుగా దేశ సంపదనంతా అంబానీ, అదానీల చేతిలో పెట్టారు. వారికి రూ.16 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ప్రతి రాష్ట్రంలో పేదల వివరాలు సేకరిస్తుంది. పేదల జాబితా తయారు చేసి, ప్రతి కుటుంబంలోని మహిళ ఖాతాలో రూ.లక్ష వేస్తాం. అని హామీ ఇచ్చారు. పదేళ్లలో మోదీ ధనికులకు రూ.లక్షల కోట్లు దోచి పెట్టారు. ధనికులకు ఇచ్చిన డబ్బును మేం పేద మహిళల ఖాతాల్లో వేస్తాం. కాంగ్రెస్ మేనిఫెస్టోలో రైతు రుణమాఫీ, మద్దతు ధర అనే రెండు ప్రధాన హామీలు ఉన్నాయి. పట్టభద్రులు, నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనతోపాటు నైపుణ్య శిక్షణ ఇస్తాం. ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగులకు నెలకు రూ.8,500 శిక్షణ భృతి అందిస్తాం. ఉపాధి హామీ పథకంలో ఇచ్చే రోజువారీ కూలీని రూ.400కు పెంచుతాం అని రాహుల్ హామీ ఇచ్చారు. తాము అధికారంలోకి వస్తే మహిళలందర్నీ లక్షాధికారులను చేస్తామని హామీ ఇచ్చారు. మహిళల అకౌంట్లో లక్ష రూపాయలు వేస్తామని తెలిపారు. ప్రపంచంలో ఏ ప్రభుత్వం కూడా ఇలా చేయలేదని.. విప్లవాత్మకమైన మార్పుకు తాము శ్రీకారం చూడతున్నామని చెప్పారు. అంతేకాకుండా ఇండియా కూటమి అధికారంలోకి వస్తే రైతులను ఆదుకుంటామని.. రైతుల రుణమాఫీ చేస్తామన్నారు రాహుల్. రైతులకు మద్దతు ధరను చట్టబద్ధత చేస్తామని తెలిపారు. నిరుద్యోగుల కోసం తాము అద్భుతమైన పథకాన్ని తీసుకువస్తున్నామని అన్నారు రాహుల్ గాంధీ. డిగ్రీ చదివిన ప్రతీ ఒక్కరికి శిక్షణ ఇచ్చి ఉద్యోగం కల్పిస్తామన్నారు. ప్రభుత్వ కాలేజీలు, వర్సిటీల్లో ఈ పక్రియ ఉంటుందని చెప్పారు.

# రాహుల్ పిల్ల చేష్టలు.. మోడీ గ్యారెంటీల మధ్య పోటీ

మొదటి పేజీ తరువాయి...

అన్నారు. భువనగిరిలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. రైతులకు రూ.2 లక్షలు రుణమాఫీ అమలు కాలేదు. వారికి ఏటా రూ.15 వేల ఆర్థిక సాయం ఇవ్వలేదు. వరి, గోధుమలకు రూ.500 బోనస్ అందించలేదు. కాంగ్రెస్ చేసిన వాగ్దానాలను ఎన్నటికీ నెరవేర్చదు. ఆ పార్టీ 70 ఏళ్లుగా అయోధ్య విషయాన్ని పక్కన పెట్టిందని విమర్శించారు. నరేంద్ర మోదీ, రాహుల్ గాంధీ మధ్య జరుగుతున్న ఎన్నికలివి. కుటుంబ అభివృద్ధి- దేశవ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధికి మధ్య ఎన్నికలు. మూడు విడతల్లో ఇప్పటికే 200 సీట్లకు పైగా స్థానాలు గెలుస్తాం. దేశవ్యాప్తంగా మొత్తం 400 లోక్‌సభ స్థానాలు సాధిస్తాం. తెలంగాణలో గత ఎన్నికల్లో 4 లోక్‌సభ సీట్లు గెలిచాం. ఈసారి 10కి పైగా గెలుస్తాం. రాష్ట్రంలో డబుల్ డిజిట్ స్కోర్‌తో దేశంలో 400 సీట్లకు మార్గం సుగమం అవుతుంది. అబద్ధాలతో ఎన్నికల్లో గెలవడానికి కాంగ్రెస్ యత్నిస్తోందని అన్నారు. మోదీ మళ్లీ వస్తే రిజర్వేషన్లు తొలగిస్తారని అవాస్తవాలు చెబుతున్నారు. ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ల ద్వారా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు నష్టం వాటిల్లుతుంది. వాటిని రద్దు చేసి మరింత పటిష్టంగా ఉన్న రిజర్వేషన్లను అమలు చేస్తామని అన్నారు. కశ్మీర్ ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమే. ఆర్టికల్ 370 రద్దుతో కశ్మీర్‌లో త్రివర్ణ పతాకం రెపరెపలాడేలా చేశాం. ఉగ్రవాదం, తీవ్రవాదాన్ని మోదీ పరిసమాప్తం చేశారు. దేశాన్ని సురక్షితంగా ఉంచారు. కాంగ్రెస్, భారాస, మజ్లిస్ మధ్య త్రికోణ బంధం ఉంది. మూడు పార్టీలు హైదరాబాద్ విమోచన దినోత్సవం నిర్వహించవు. రద్దు చేసిన ట్రిపుల్ తలాక్‌ను పునరుద్ధరించేందుకు యత్నిస్తున్నారు. భువనగిరి టెక్స్‌టైల్ పరిశ్రమల కోసం మోదీ కృషి చేశారు. రూ.1500 కోట్లతో జాతీయ టెక్స్‌టైల్ విధానం అమల్లోకి తెచ్చాం. భువనగిరి నుంచి భూపాలపల్లి వరకు జాతీయ రహదారి నిర్మించాం. బీబీ నగర్ ఎయిమ్స్ నిర్మించి పేద ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నాం. జనగామ నుంచి భువనగిరి వరకు రైల్వే లైన్ల ఆధునికీకరణ చేపట్టాం. కొమురవెల్లిలో అత్యాధునిక రైల్వే స్టేషన్ నిర్మిస్తున్నాం. భారాస ప్రభుత్వ హయాంలో కుటుంబం మాత్రమే బాగుపడింది. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణను ఏటీఎంగా వాడుకుంటోంది అని అమిత్‌షా విమర్శించారు. ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

# మెదక్‌లో వెంకట్రామిరెడ్డిదే విజయం


## రెండు,మూడో స్థానాలకు కాంగ్రెస్, బిజెపి పోటీ

## బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ధీమా

సిద్దిపేట, మే 9 (ప్రభాత ఉదయం): తెలంగాణలో 6 గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయలేక అట్టర్ ఫ్లాప్ అయిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. కేవలం ఐదు నెలల కాలంలోనే రేవంత్ ప్రభుత్వం తీవ్ర ప్రజా వ్యతిరేకత తెచ్చుకుందని అన్నారు. బీజేపీ తెలంగాణకు మొండిచేయి చూపించిందని ఆరోపణలు చేశారు. ఆ పార్టీ కార్మికులకు వ్యతిరేకంగా, కార్పొరేట్లకు అనుకూలంగా పని చేస్తుందని విమర్శించారు. గురువారం హరీశ్‌రావు పలు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రాంరెడ్డి భారీ మెజార్టీతో గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. ద్వితీయ స్థానం బీజేపీనా, కాంగ్రెస్సా అనేది ఆ పార్టీలే తేల్చుకోవాలని హరీశ్‌రావు పేర్కొన్నారు.తెలంగాణలో బీజేపీ మతం పేరిట ఓట్లు అడిగే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. మత రాజకీయాలు తెలంగాణలో నడవవని మందలించారు. కాంగ్రెస్ చేసింది చెబితే అభ్యంతరం లేదని కానీ చేయనివి కూడా చెబుతూ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. 100 రోజుల్లో ఆరు గ్యారంటీలు, రుణమాఫీ అమలు చేస్తానని సీఎం రేవంత్ రెడ్డి అన్నారని ఇంతవరకు ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ఇప్పుడు దేవుళ్లమీద ఒట్లు పెడుతున్నారని.. ఇప్పుడు కూడా చెబుతున్నా పంద్రాగస్టులోగా ఆరు గ్యారంటీలు, రుణమాఫీ చేస్తే రాజీనామాకు తాను సిద్ధమని హరీశ్‌రావు మరోసారి సవాల్ విసిరారు. రేవంత్ రెడ్డి తన సవాల్‌ను స్వీకరించకుండానే డైలాగ్‌లు కొడుతున్నారని సెటైర్లు విసిరారు. పబ్బం గడుపుకునే రాజకీయాలు చేస్తూ కేసీఆర్ పట్ల రేవంత్ అనుచితంగా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. రెండు జాతీయ పార్టీలు ప్రజలను మోసం చేస్తున్నాయని మండిపడ్డారు. హిందువుల ఆస్తులు ముస్లింలకు ఇవ్వడం జరగదని.. రిజర్వేషన్లు తొలగించడం జరగదని చెప్పుకొచ్చారు. రెండు జాతీయ పార్టీలు ప్రజలను రెచ్చగొట్టడం ద్వారా రాజకీయ ప్రయోజనాలు పొందాలని చూస్తున్నాయని ధ్వజమెత్తారు. రేవంత్ ప్రభుత్వం రివర్స్‌లో నడుస్తోందని ఎద్దేవా చేశారు. సిద్దిపేటలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రోడ్ షో ఉంటుందని ప్రకటించారు. ఈ రోడ్ షో ముస్తాబాద్ చౌరస్తా నుంచి పాత బస్టాండ్ వరకు ఉంటుందని వెల్లడించారు.

# భైంసాలో కేటిఆర్‌కు చేదు అనుభవం

మొదటి పేజీ తరువాయి...



నిర్మించారని గుర్తుచేశారు. ఆధునిక దేవాలయాల లాంటి కాళేశ్వరం ప్రాజెక్టు, పాలమూరు ఎత్తి పోతల నిర్మించారని ఉద్ఘాటించారు. పదేళ్లలో చేసిందేమి చెప్పుకోలేకనే దేవుడి పేరుతో మోదీ ఓట్లు అడుగుతున్నారని విరుచుకుపడ్డారు. రాముడు అందరి వాడు, ఒక బీజేపీ నేతలకు మాత్రమే దేవుడు కాదని హితవు పలికారు. మత రాజకీయం చేస్తున్న బీజేపీని ప్రజలు చిత్తు చిత్తుగా ఈ ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు.హామీల అమల్లో విఫలమైన కాంగ్రెస్‌కు కర్రు కాల్చి వాత పెట్టాలని కేటీఆర్ హెచ్చరించారు.

# పద్మవిభూషణుడు మన చిరంజీవి

మొదటి పేజీ తరువాయి...

సురేఖ, కుమారుడు రామ్ చరణ్, కోడలు ఉపాసన పాల్గొన్నారు. ఈ ఏడాది కేంద్రం ఐదుగురికి పద్మ విభూషణ్, 17 మందికి పద్మ భూషణ్, 110 మందికి పద్మ శ్రీ పురస్కారాలు ప్రకటించింది. 1978లో సినీ కెరీర్ ప్రారంభించిన చిరంజీవి స్వయం కృషితో అలుపెరగకుండా సినిమాలు చేస్తూ..ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచారు. సినిమాలే కాకుండా సామాజికంగా ఎన్నో సేవలు చేశారు. గతంలో కేంద్ర ప్రభుత్వం చిరంజీవిని పద్మభూషణ్ అవార్డుతో సత్కరించిన సంగతి తెలిసిందే. ఇక చిరు సినిమాల విషయానికి వస్తే ప్రస్తుతం ఆయన విశ్వంభర మూవీతో ప్రేక్షకులను పలకరించనున్నారు. బింబిసార ఫేమ్ వశిష్ట ఈ చిత్ర దర్శకుడు. సోషియో ఫాంటసీ నేపథ్యంలో తెరకెక్కుతుంది. చిరంజీవికి జోడీగా త్రిష నటిస్తుంది. ఈషా చావ్లా, సురభి వంటి యంగ్ హీరోయిన్స్ సైతం జాయిన్ అయ్యారు. వచ్చే ఏడాది సంక్రాంతికి సినిమాను రిలీజ్ చేయనున్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా.. 2024 సంవత్సరానికి గాను కేంద్ర ప్రభుత్వం 132 మందికి పద్మ అవార్డులను ప్రకటించిన విషయం తెలిసిందే! వారిలో 67 మందికి ఏప్రిల్ 22వ తేదీన పద్మ అవార్డుల్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రదానం చేయగా.. మిగిలిన 65 మందికి గురువారం సాయంత్రం ప్రదానం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ నటుడు చిరంజీవి పద్మ విభూషణ్ పురస్కారం అందుకున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఉపరాష్ట్రపతి, పలువు కేంద్రమంత్రులతో పాటు అధికారులు హాజరయ్యారు. వివిధ రంగాల్లో విశేష కృషి సేవలందించిన వారిని పద్మ భూషణ్, పద్మ విభూషణ్, పద్మశ్రీ పురస్కారాలను అందించారు. అసాధారణమైన విశిష్ట సేవకు పద్మవిభూషణ్, ఉన్నత స్థాయి విశిష్ట సేవలకు పద్మభూషణ్, విశిష్ట సేవలకు పద్మశ్రీ పురస్కారాలు ఇవ్వడం జరుగుతుంది. ఈ అవార్డు గ్రహీతల్లో 30 మంది మహిళలు ఉండటం విశేషం. మెగాస్టార్ చిరంజీవి పద్మవిభూషణ్ అవార్డు అందుకోవడంతో పలువురు శుభాకాంక్షలు తెలిపారు. అక్కినేని నాగేశ్వర్‌రావు తర్వాత టాలీవుడ్‌లో ఈ అవార్డు అందుకోనున్న రెండవ నటుడు చిరంజీవి కావడం విశేషం. ఈ స్పెషల్ ఈవెంట్ మెగా అభిమానులందరికీ ప్రత్యేకమని చెప్పవచ్చు. ఈ సందర్భంగా అనేక మంది సినీ ప్రముఖులతోపాటు పలువురు అభిమానులు కూడా సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

# మధురానగర్ అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీలో చేరాను

## స్రవంతి శ్రీకాంత్ రెడ్డి



శంషాబాద్, మే 9 (ప్రభాత ఉదయం): ప్రభాత ఉదయం . మధురానగర్ కాలనీని సమగ్రంగా అభివృద్ధి చేయడం కోసమే అధికార కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు మధురానగర్ వార్డు కౌన్సిలర్ స్రవంతి శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. మధుర నగర్ కాలనీలో ఇప్పటికే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిసి రోడ్లు వీధి దీపాలు ఏర్పాటు చేయడం జరిగిందనివివరించారు. 50 లక్షల రూపాయలతో చేపట్టిన కమ్యూనిటీ హాల్ నిర్మాణం పెండింగ్ లో ఉన్నదని తెలిపారు. వీటితోపాటు మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు వీలుగా స్థానిక పార్లమెంటు సభ్యుడు రంజిత్ రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిందని తెలిపారు. మధురానగర్ను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దడం కోసమే తాను పార్టీ మారినట్లు ఆయన స్పష్టం చేశారు. పార్టీ నాయకులు డి. సంతోష్ రెడ్డి.గోటూరి పవన్ గౌడ్. గాజుల రాజు. గోవర్ధన్ రెడ్డి. గడ్డం జైహింద్ రెడ్డి. గోపాల్ రెడ్డి. సురేష్. ఆగమయ్య. రాజు. సంగమేశ్వర్. బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ వైపు ప్రజల చూపు

## చేతి గుర్తుకు ఓటు వేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు




కొత్తకోట, మే9 (ప్రభాత ఉదయం) తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గ శాసనసభ్యులు జి మధుసూదన్ రెడ్డి ఆదేశానుసారం పాలమూరు పార్లమెంట్ అభ్యర్థి జిల్లా వంశీచందర్ రెడ్డి గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ నాయకులు ఇంటింటికి ప్రచారం చేశారు. గురువారం కొత్తకోట మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోతులపల్లి మేస్త్రి శీనన్న ఆధ్వర్యంలో కొత్తకోట మున్సిపాలిటీ 4.వ వార్డు ఇన్చార్జ్ ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి సభ్యులు పి జె బాబు ,ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ హస్తం గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ ప్రచార కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ధన్వాడ బాలస్వామి, 5 వార్డు ఇన్చార్జి మాందాపురం లక్ష్మయ్య, రాష్ట్ర ఫిషర్మెన్ కమిటీ కార్యదర్శి సంద వెంకటేష్, కదిరే సాయిలు, పెంటన్న యాదవ్, అంజన్న సాగర్, గంగు రంగారెడ్డి, వెంకట్ రెడ్డి, జగ్గన్న, బాలకొండ, చంద్రశేఖర్, గౌనికాడి నరేందర్ యాదవ్, మద్దిగట్ల శాంతి రెడ్డి, గోపి జగ్వర్ , కొత్తకోట యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు మొద్దు నవీన్ కుమార్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, వెంకటేష్, శ్రీకాంత్, బాలరాజు, వెంకటేష్, శ్రీకాంత్ సోషల్ మీడియా తదితరులు 4,5 వార్డులలో విస్తృతంగా ప్రచారం చేశారు.

# పాలమూరు ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీ చంద్ రెడ్డికి మద్దతుగా ఎమ్మెల్యే జిఎంఆర్ సతీమణి కవితా రెడ్డి

## కొత్తకోట రోడ్ షో లో పాల్గొన్న ఎమ్మెల్యే జిఎం ఆర్ సతీమణి జి. కవిత



హస్తం గుర్తుకు ఓటు వేయాలని మహిళలను కోరుతున్న ఎమ్మెల్యే జిఎంఆర్ సతీమణి కవితా రెడ్డి

కొత్తకోట, మే 9(ప్రభాత ఉదయం) పాలమూరు ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ చల్లా వంశీచంద్ రెడ్డి గెలుపు కోసం దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్ సతీమణి కవితా రెడ్డి ప్రచారం నిర్వహించారు. గురువారంకొత్తకోట మండల కేంద్రంలో జరిగిన కాంగ్రెస్ పార్టీ రోడ్ షో లో దేవరకద్ర నియోజకవర్గం శాసన సభ్యులు జి. మధుసూదన్ రెడ్డి సతీమణి కవితా రెడ్డి పాల్గొన్నారు. మహబూబ్ నగర్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చల్లా వంశీ చంద్ రెడ్డి కి ఓటు వేసి ఎంపీ గా గెలిపించి మన దేవరకద్ర నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందామని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నాలుగో విడత ఎన్నికలకు సమీపిస్తున్న గడువు

మొదటి పేజీ తరువాయి...

సాయంత్రంతో ప్రచారం ముగియనుంది. ఈ క్రమంలో ఎన్నికలకు 48 గంటల ముందు అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని కేంద్ర ఎన్నికల సంఘం సూచించింది. ఏపీలో పలు జిల్లాల్లో సున్నితమైన ప్రాంతాలు ఉన్నాయని.. అలాంటి చోట కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని సీఈసీ ఆదేశాలు జారీ చేసింది. పోలింగ్ కేంద్రానికి వచ్చే ఓటర్లకు ఎండదెబ్బ తగలకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సీఈసీ రాజీవకుమార్ సూచించారు. ఈనెల 13 న నాలుగవ దశలో ఎన్నికల జరిగే రాష్ట్రాల అధికారులతో కేంద్ర ఎన్నికల కమిషనర్ రాజకుమార్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 14 రాష్ట్రాలు, 2 కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఈ నెల 13న ఎన్నికలు జరుగనున్నాయి. ఎన్నికల ఏర్పాట్లపై కేంద్ర పరిశీలకులు, ప్రత్యేక పరిశీలకులు, ప్రధాన ఎన్నికల అధికారులు, జిల్లా ఎన్నికల అధికారులకు రాజీవ్ కుమార్ పలు సూచనలు చేశారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించేందుకు చేస్తున్న ఏర్పాట్లను ఆయన సమీక్షించారు. నాల్గవ దశలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, తదితర 14 రాష్ట్రాలతో పాటు పలు కేంద్ర పాలిత ప్రాంతాలకు ఈనెల 13 న ఎన్నికలు జరుగనున్నట్లు తెలిపారు. అయితే వీటన్నింటిలో ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలను ఎంతో సున్నితమైనవిగా ఎన్నికల సంఘం గుర్తించిందన్నారు. ఈ రాష్ట్రాల్లో ఎన్నికల నిర్వహణ విషయంలో ఎన్నికల యంత్రాంగం అంతా ఎంతో అప్రమత్తంగా ఉండాలన్నారు. మే 13న ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు ముందు 48 గంటలు ఎంతో కీలకమైనవన్నారు. 24 గంటలు ఎంతో అప్రమత్తంగా ఉండాలని.. హింసకు ఏ మాత్రం అవకాశం లేకుండా శాంతి భద్రతలను పరిరక్షించాలని సూచించారు. ప్రత్యేకించి నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో కేంద్ర బలగాలతో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. ఓటర్లను ప్రభావితంచేసే నగదు, ఇతర ఉచితాల పంపిణీపై గట్టి నిఘా ఉంచాలన్నారు. ప్రత్యేకించి సాధారణ, పోలీస్, వ్యయ పరిశీలకులు ఎంతో అప్రమత్తంగా ఉండాలని, ఎటు వంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా చూడాలన్నారు. నాలుగో దశ ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ అత్యంత సునిశితమైన రాష్ట్రంగా ఎన్నికల సంఘం ప్రకటించింది. ప్రత్యేకించి కొన్ని జిల్లాలు సమస్యాత్మకంమైనవిగా గుర్తించడమైందని, ముఖ్యంగా ప్రత్యేక పరిశీలకులు ఆయా జిల్లాలో తరచుగా పర్యటిస్తూ ఎటువంటి అవాంచనీయ సంఘటనలకు అవకాశం లేకుండా చూడాలన్నారు. ఆయా జిల్లాలు, నియోజక వర్గాలకు సంబంధించిన తాజా సమాచారాన్ని ఎప్పటి కప్పుడు తమకు నేరుగా తెలియపర్చాలని కేంద్ర ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన వెంటనే ఆంధ్రప్రదేశ్‌లో పలు జిల్లాల్లో హింసాత్మక ఘటనలు చోటు చేసుకోవడంతో తిరిగి అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఎండలు, వడగాల్పులు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఓటర్లు ఏమాత్రము ఎండ బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. క్యూలైన్లు అన్ని షామియానాలతో కవర్ అయ్యేలా చూడాలని, ఓటర్లు కూర్చునేందుకు క్యూలైన్లలో బెంచ్?లను ఏర్పాటు చేయాలని, ప్రత్యేకించి త్రాగునీరు, ఓ.ఆర్.ఎస్, ప్రథమ చికిత్స సేవలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఓటు వేయడం సామాజిక బాధ్యత అనే విషయాన్ని ఎస్.ఎం.ఎస్., షోషల్ మీడియా ద్వారా ఓటర్లను చైతన్య పరుస్తూ ఓటింగ్ శాతాన్ని పెద్ద ఎత్తున పెంచాలని ఆదేశించారు.



# అన్ని వర్గాలను కలుపుకుపోతూ కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్ రెడ్డి గెలుపు కోసం కృషి చేస్తున్న నాయకులు


ఓటరు స్లిప్పులను పంచుతున్న పలుగు చెరువు మహేష్, బొక్క ప్రభాకర్ రెడ్డి


కాంగ్రెస్ లో చేరిన బీఆర్ఎస్ నాయకులు


మైలార్ దేవుపల్లి డివిజన్ బూత్ కమిటీ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మేయర్ బొంతు రామ్మోహన్


సులేమాన్ నగర్ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న షేక్ నయిముద్దీ

### బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ లో చేరుతున్న నాయకులు
### ఈ నెల 13వరకు నా కోసం పనిచేయండి..
### ఐదు సంవత్సరాలు మీకు అందుబాటులో ఉంటా : డాక్టర్ గడ్డం రంజిత్ రెడ్డి

బుద్వేల్, మే9(ప్రభాత ఉదయం) : అన్ని వర్గాల ప్రజలను కలుపుకు పోతు ముందుకు సాగుతున్నారు.... చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్ రెడ్డి. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దూసుకుపోతున్నారు.

**కాంగ్రెస్ లో చేరిన బీఆర్ఎస్ నాయకులు :**

రాజేంద్రనగర్ నియోజకవర్గం చెందిన బీఆర్ఎస్ ముఖ్య నాయకులు రాపోలు సత్తయ్య, కే సత్యనారాయణ గౌడ్, నారాయణ స్వామీ, పెదిరిపాటి శేఖర్ గౌడ్ లు గురువారం జూబ్లీహిల్స్ లోని చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా డాక్టర్ రంజిత్ రెడ్డి మాట్లాడుతూ , ఈనెల 13 వరకు తనకోసం పనిచేయాలని, వచ్చే ఐదు సంవత్సరాలు మీకు అండగా ఉండి సేవ చేస్తానని తెలిపారు.

**ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లను కలవాలి : బొంతు రామ్మోహన్**

ప్రతి ఇంటికి బూత్ కమిటీ నాయకులు వెళ్లి ఓటర్లను కలిసి వారు ఓటు వేసే విధంగా ప్రోత్సాహాన్ని అందించాలని మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ పిలుపునిచ్చారు. బూత్ స్థాయి నాయకులు కష్టపడి పని చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బూత్ స్థాయి నాయకుల కష్ట ఫలితమే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం అని , పార్లమెంట్ ఎన్నికల్లోను అదే ఉత్సాహంతో పనిచేయాలన్నారు. చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని బొంతు రామ్మోహన్ సూచించారు. సమావేశంలో తెలంగాణ మైనారిటీ గురుకుల విద్యాసంస్థల వైస్ చైర్మన్ మహమ్మద్ ఫహీం ఖురేషీ, తెలంగాణ రాష్ట్ర డైరీ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బి జ్ఞానేశ్వర్ ముదిరాజ్, మైలార్ దేవ్ పల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ సామ ఇంద్రపాల్ రెడ్డి , డివిజన్ అధ్యక్షుడు ఎన్. ధనుంజయ లతోపాటు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఓటరు స్లిప్పులను పంపిణీ చేసిన పలుగు చెరువు మహేష్, బొక్క ప్రభాకర్ రెడ్డిలు :**

రాజేంద్రనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కో ఆర్డినేటర్ పలుగు చెరువు మహేష్, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొక్క ప్రభాకర్ రెడ్డి లు డివిజన్ పరిధిలోని వివిధ పోలింగ్ బూతులలో ఓటర్ స్లిప్పులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ ద్వారానే దేశంలో అన్ని మతాల, వర్గాల ప్రజలు శాంతియుత జీవనం సాగిస్తారన్నారు. ప్రజలు కాంగ్రెస్ కు ఓటు వేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.

**సులేమాన్ నగర్ డివిజన్ డివిజన్ లో షేక్ నయీముద్దీన్ ప్రచారం :**

ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన షేక్ నయీముద్దీన్ చింతల్ మెట్ , సులేమాన్ నగర్ పరిసర బస్తీలలో చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్ రెడ్డిని గెలిపించాలంటూ ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు . ముస్లిం మైనారిటీలు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలన్నారు.


లక్ష్మీగూడలో కుమ్మరితో కలిసి కుండలు చేస్తూ ప్రచారం చేసిన సీనియర్ నాయకులు సరికొండ వెంకటేష్, ఆడికె అర్జున్

# చేవెళ్ల గడ్డపై రంజిత్ రెడ్డి ఘన విజయం ఖాయం

## సీనియర్ నాయకులు సరికొండ వెంకటేష్

రాజేంద్రనగర్,మే08(ప్రభాత ఉదయం) చేవెళ్ల గడ్డపై ప్రజలు భారీ మెజార్టీతో డాక్టర్ రంజిత్ రెడ్డిని మరోసారి పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నుకోవటానికి సిద్ధంగా ఉన్నారని రాజేంద్రనగర్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు,ఉద్యమకారుడు సరికొండ వెంకటేష్ అన్నారు. గురువారం మైలార్ దేవులపల్లి డివిజన లక్ష్మీగూడ,తదితర బస్తీలలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆడకే అర్జున్ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు.కుమ్మరి బస్తీలో కుండలు చేస్తూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు.ఈ సందర్భంగా సరికొండ వెంకటేష్ మాట్లాడుతూ..గత ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు చరమ గీతం పాడి ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారని అన్నారు.కాంగ్రెస్ గెలవగానే సంక్షేమ పథకాల అమలుకు శ్రీకారం చుట్టిందని తెలిపారు.నిరంతరం ప్రజలకు అండగా ఉంటూ ప్రజాసేవే సేవే పరమావధిగా పనిచేస్తున్న డాక్టర్ గడ్డం రంజిత్ రెడ్డి దీవించి మరోసారి గెలిపించి పార్లమెంటుకు పంపించాలని కోరారు.తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ అని గుర్తు చేశారు.మిగులు బడ్జెట్‌తో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పుల పాలు చేశారని విమర్శించారు.కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేశారని తెలిపారు.భారత్ జూడో యాత్రకు ప్రజల నుండి విశేష స్పందన వచ్చిందని తెలిపారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేయాలంటే కాంగ్రెస్ చేవెళ్ల పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి రంజిత్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ కు ఓటమి తప్పదని అన్నారు.ఆయన మూడో స్థానానికి పరిమితం కావాల్సి వస్తుందన్నారు.కేంద్రంలో బీజేపీ రాష్ట్రంలో బిఆర్ఎస్ అధికారంలో ఉండి చేసింది ఏమి లేదన్నారు.పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆడికే అర్జున్, రవిముదిరాజ్,అరుణ్,భాస్కర్,ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


తలారి కమలమ్మ పార్థీవ దేహాన్ని సందర్శించిన కొండ శైలజా రెడ్డి

## గగన్ పహాడ్‌లో అనారోగ్యంతో మరణించిన కమలమ్మ పార్థీవ దేహాన్ని సందర్శించిన కొండా శైలజా రెడ్డి

బుద్వేల్, మే9(ప్రభాత ఉదయం) : బీజేపీ సీనియర్ నాయకుడు గగన్ పహాడ్ వాసి తలారి అశోక్ చిన్నమ్మ కమలమ్మ (68) బుధవారం రాత్రి 11 గంటలకు మరణించారు. ఆమె సమాధి కార్యక్రమాలు గురువారం గగన్ పహాడ్ లో జరిగాయి. కమలమ్మ మరన వార్త గురించి తెలుసుకున్న బీజేపీ చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం అభ్యర్థి కొండ విశ్వేశ్వర్ రెడ్డి సోదరి కొండ శైలజా రెడ్డి కమలమ్మ పార్థివదేహాన్ని సందర్శించి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కమలమ్మ భర్త తిమోతి గతంలోనే మరణించారు. ఆమెకు నలుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు సంతానం. ఒక కుమార్తె మరణించగా, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

## రాజేంద్రనగర్ సర్కిల్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలుగా డి ఝాన్సీ



రాజేంద్ర నగర్, మే 9(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ సర్కిల్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలుగా డి ఝాన్సీ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం తెలంగాణ మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఏ సదాలక్ష్మి, డిసిసి ఉపాధ్యక్షులు కోరని బాలరాజ్ చేతుల మీదుగా ఝాన్సీ నియామక పత్రం స్వీకరించారు. ఈ సందర్భంగా సదాలక్ష్మి, కోరని బాలరాజు మాట్లాడుతూ... పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు మహిళా నాయకురాలు పనిచేయాలని సూచించారు. సర్కిల్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలుగా నియమితులైన ఝాన్సీ మాట్లాడుతూ.. తనపై ఎంతో నమ్మకంతో అప్పజెప్పిన బాధ్యతను వమ్ము చేయకుండా కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

## చేవెళ్ల పార్లమెంటు ఎన్నికల్లో బీసీల ఐక్యత చూపాలి: ప్రకాశ్ గౌడ్

బుద్వేల్, మే9(ప్రభాత ఉదయం) : బీఆర్ఎస్ పార్టీ తరపున చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న బలహీన వర్గాల అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ను భారీ మెజారిటీతో గెలిపించుకోవడానికి ఎస్సీ , ఎస్టీ , బీసీ , మైనారిటీలతోపాటు ప్రతి ఒక్కరు కృషి చేయాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ అన్నారు. మైలార్ దేవ్ పల్లి లో గల దుర్గా కన్వెన్షన్ లో గురువారం మధ్యాహ్నం బీఆర్ఎస్ నాయకుల సమావేశం నిర్వహించారు . ఈ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ ,ఒక బీసీ నాయకుడు పోటీ చేస్తుంటే అనేక విమర్శలు చేస్తున్నారని, ఆ విమర్శలు తిప్పి కొట్టాలంటే ప్రతి ఒక్కరు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తాను మర్యాదపూర్వకంగానే కలిశానన్నారు . తాను బీఆర్ఎస్ లోనే ఉంటానని తేల్చి చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని ఎంతగానో అభివృద్ధి చేశారని గుర్తు చేశారు . అందుకే ప్రజలు ఆయనకు ఇప్పుడు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నాగేందర్ గౌడ్ , పుట్టం పురుషోత్తమ్ రావు, తలారి మల్లేష్ , ప్రకాశన్న యువసేన అధ్యక్షుడు టి. రాము గౌడ్, నాయకులు ఎడ్లకాడి సూర్యం, వజ్రమ్మ , లక్ష్మీ రాజ్, గుమ్మడి కుమార్ , డి రమేష్ ముదిరాజ్, రాజు ముదిరాజ్ , భూదేవి, బి రాజేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

### కాంగ్రెస్ గ్యారెంటీలకు కాలం చెల్లింది : శీలం తిరుపతిరెడ్డి

బుద్వేల్, మే9(ప్రభాత ఉదయం): దేశాభివృద్ధి బీజేపీ తోనే సాధ్యమవుతుందని రాజేంద్రనగర్ సర్కిల్ సీనియర్ బీజేపీ నాయకులు శీలం తిరుపతిరెడ్డి అన్నారు. గురువారం గగన్ పహాడ్ బస్తీలో చేవెళ్ల అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి కి మద్దతుగా ఇంటింటి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఒక్కరిని కలుస్తూ నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా నమునా బ్యాలెట్ పేపర్లు ప్రజలకు పంపిణీ చేస్తూ కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. అనంతరం శీలం తిరుపతిరెడ్డి మాట్లాడుతూ, పదేళ్లు దేశాన్ని పాలించిన బీజేపీ ని మూడోసారి అవకాశం కల్పిస్తే దేశం మరింత పురోగతి సాధిస్తుందన్నారు. ప్రపంచంలో భారత దేశం ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన ఘనత ప్రధాని నరేంద్ర మోదీకే దక్కుతుందన్నారు. అభివృద్ధి బీజేపీ తోనే సాధ్యమని,చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డిని గెలిపించాలని కోరారు. మోదీపాలన జనరంజకంగా ఉందన్నారు.ప్రజలు ఈసారి బీజేపీ వైపు చూస్తున్నారని చెప్పారు. బీజేపీ పై అబద్ధాలు ప్రచారం చేయడంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు పోటీపడుతున్నాయని ఆయన అన్నారు. ప్రపంచ పటంపై భారతదేశాన్ని సగర్వంగా నిలిపిన ఘనత ప్రధాని నరేంద్రమోదీకి దక్కుతుందని తెలిపారు. ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని తెలిపారు. ఐదు నెలలకే కాంగ్రెస్ సర్కారుపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని, గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కేసీఆర్ నియంత మాదిరి వ్యవహరించారని ఆరోపించారు. కేంద్రంలో ముచ్చటగా మూడోసారి భాజపా అధికారంలోకి రావటం ఖాయమని,ఇక్కడా బీజేపీ ని ఆశీర్వదిస్తే అభివృద్ధి గాడిన పడుతుందన్నారు. సుదీర్ఘ రాజకీయ జీవితంలో నరేంద్రమోదీ మచ్చలేని నాయకుడిగా నిలిచారని గర్వంగా చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బీజేపీ నాయకులు జోగి రవి, సూరెడ్డి వినయ్ రెడ్డి, తలారి చిన్న,వల్లూరి శ్రీనివాస్,చిన్ననందు,వినయ్, జె.నాగేష్,జె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


ముస్లిం మైనారిటీలను ఉద్దేశించి మాట్లాడుతున్న మజ్లీస్ అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీ

## సెక్యులర్ పార్టీకి ఓటు వేయండి: అసదుద్దీన్ ఓవైసీ

బుద్వేల్, మే9(ప్రభాత ఉదయం) : చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం తో పాటు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ముస్లిం మైనారిటీలందరూ సెక్యులర్ పార్టీకి ఓటు వేయాలని మజ్లీస్ పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీ పిలుపునిచ్చారు. గురువారం మధ్యాహ్నం రాజేంద్రనగర్ సర్కిల్ సులేమాన్ నగర్ డివిజన్ పరిధిలో గల టీఎస్ పారడైజ్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన ముస్లిం మైనారిటీలు, మజ్లీస్ నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు ఈనెల 13న పోలింగ్ స్టేషన్ కు వెళ్లి తమ ఓటు వేయాలన్నారు. భారతదేశంలో రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ముస్లింల కోసం పనిచేస్తున్న పార్టీకే ఓటు వేయాలన్నారు ఇటీవల బీఆర్ఎస్ పార్టీ నుంచి మజ్లీస్ పార్టీ లో చేరిన మహమ్మద్ ముర్తుజా అలీ ని సభకు పరిచయం చేశారు . ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యుడు మీర్జా రహ్మత్ బేగ్, నాయకులు నవాజుద్దీన్, హబీబ్ జైన్ ఆరీఫ్, మహమ్మద్ ముర్తుజా అలీ, తాహెర్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న ముస్లిం మైనారిటీలు


గగన్ పహాడ్ లో ప్రచారం చేస్తున్న శీలం తిరుపతి రెడ్డి, తదితరులు

## సోదరుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి

### కొండా గౌతమీ రెడ్డి

బుద్వేల్, మే9(ప్రభాత ఉదయం): చేవెళ్ళ పార్లమెంటు నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సోదరుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన సోదరి కొండ గౌతమీ రెడ్డి హైదర్ గూడ , రాజేంద్రనగర్ పరిసర బస్తీలలో విస్తృతంగా పర్యటిస్తూ ప్రచారం చేస్తున్నారు. ఈనెల 13న జరుగునున్న పోలింగ్ సందర్భంగా ప్రతి ఓటరు పోలింగ్ స్టేషన్ కు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచిస్తున్నారు. ఆమె వెంట బీజేపీ మహిళా మోర్చా రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మేకల వనితా దామోదర్ రెడ్డి తదితరులు ఉన్నారు.


హైదర్ గూడలో ప్రచారం చేస్తున్న కొండా గౌతమీ రెడ్డి

# మొక్క జొన్న ఉత్పాదకతను పెంచాలి: డాక్టర్ టి.ఆర్ శర్మ

బుద్వేల్, మే9(ప్రభాత ఉదయం): భవిష్యత్ అవసరాలకి తగ్గట్లుగా, అధునాతన టెక్నాలజీని వినియోగించుకుంటూ, వాతావరణ మార్పులని తట్టుకునే వంగడాల సహాయంతో మొక్కజొన్న ఉత్పత్తి, ఉత్పాదకతల్ని అధికం చేయాల్సిన అవసరం ఉందని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐ సీ ఏ ఆర్) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (క్రాప్ సైన్సెస్) డాక్టర్ టి.ఆర్ శర్మ సూచించారు. గత కొన్నేళ్లుగా మొక్కజొన్న విషయంలో దేశం సాధించిన ప్రగతి అపూర్వమని ఆయన అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, భారత మొక్కజొన్న పరిశోధనా సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్న 67 వ మొక్కజొన్న పరిశోధనా కేంద్రాల వార్షిక సదస్సులో ఆయన గురువారం ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. మూడు రోజులపాటు జరిగే ఈ సదస్సు శుక్రవారం తో ముగియనుంది. మొక్కజొన్న ముడి పదార్థంగా ఇథనాల్ సహా అనేక ఉత్పత్తులు తయారవుతున్నాయని టి.ఆర్ శర్మ అన్నారు. తరుగుతున్న భూ, నీటి వనరులు, వాతావరణ మార్పులు, పెరుగుతున్న డిమాండ్లను దృష్టిలో పెట్టుకొని ఉత్పత్తి ఉత్పాదకతల్ని పెంపొందించడానికి శాస్త్రవేత్తలు ప్రణాళికలు రూపొందించాలన్నారు. డ్రోన్లు, శాటిలైట్లు, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వంటి అధునాతన టెక్నాలజీని విరివిగా ఉపయోగించాలన్నారు. పరిశోధన సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేట్ పరిశ్రమలు పరస్పర సహకారం, సమన్వయంతో పనిచేయాలన్నారు. విలువల జోడింపు, మార్కెట్ అనుసంధానాలపై ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకోవాలని టి.ఆర్ శర్మ అభిప్రాయపడ్డారు. సుమారు 165 దేశాల్లో సాగు అవుతూ మొక్కజొన్న ప్రధాన ప్రపంచ పంటగా గుర్తింపు పొందిందని వ్యవసాయ విశ్వవిద్యాలయం ఇన్చార్జి రిజిస్ట్రార్, పరిశోధనా సంచాలకులు డాక్టర్ పి. రఘురామి రెడ్డి అన్నారు. తెలంగాణలోనూ మొక్కజొన్న ప్రధాన పంట అని ఆయన అన్నారు. అయితే ప్రాంతాలవారీగా ఉత్పత్తి, ఉత్పాదకతల్లో అంతరాలు ఉన్నాయని వివరించారు. నీటి ఎద్దడి, చీడపీడలు, భూసార క్షీణత, మార్కెట్ కి సరైన అనుసంధానం లేకపోవడం వల్ల మొక్కజొన్న రైతులు సవాళ్లని ఎదుర్కొంటున్నారని, వాటిని అధిగమించడానికి సమీకృత ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రస్తుతం బేబీ కార్న్, స్వీట్ కార్న్ లకు ఆదరణ అధికం అవుతుందని సేంద్రియ, సహజ వ్యవసాయ విధానాల వల్ల ఈ రకాల మొక్కజొన్న సాగుకి ప్రాధాన్య ఇవ్వాలని రఘురామి రెడ్డి సూచించారు. ఈ సదస్సులో ఐ సీ ఏ ఆర్ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ (ఫుడ్, పాడర్ క్రాప్స్) డాక్టర్ ఎస్ కె ప్రధాన్, ఐ సీ ఏ ఆర్ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ (సీడ్స్) డాక్టర్ డి కె యాదవ , భారత మొక్కజొన్న పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ హెచ్ ఎస్ జాట్, నోడల్ అధికారి డాక్టర్ పి. రమేష్ కుమార్, మొక్కజొన్న పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం వి నగేష్ కుమార్, విశ్వవిద్యాలయ అధికారులు, శాస్త్రవేత్తలు, వివిధ ఐ సీ ఏ ఆర్ సంస్థల సంచాలకులు, ప్రైవేట్ సంస్థల ప్రతినిధులు, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొక్కజొన్న పంట సాగులో ప్రతిభ కనపర్చిన రైతులు,. ఎఫ్ పీ ఓ ల ప్రతినిధుల్ని సన్మానించారు . వివిధ ప్రచురణల్ని విడుదల చేశారు.



మొక్క జొన్న పరిశోధన సంస్థల 67వ వార్షిక సదస్సు ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న డాక్టర్ టి ఆర్ శర్మ



మొక్క జొన్న రైతును సన్మానిస్తున్న శాస్త్రవేత్తలు

# కొండా గెలుపు కోసం నారి శక్తి నడుము బిగించాలి



బిజెపి రంగారెడ్డి జిల్లా మహిళా మోర్చా కార్యదర్శి వనితారెడ్డి కి సూచనలు చేస్తున్న సంగీతారెడ్డి



నారి శక్తి కార్యక్రమంలో పాల్గొన్న మహిళ నాయకురాళ్లతో చేవెళ్ల బిజెపి ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి సతీమణి సంగీతారెడ్డి

## కొండా సంగీతారెడ్డి

శేరి లింగంపల్లి, మే9(ప్రభాత ఉదయం) చేవెళ్ల పార్లమెంట్ బిజెపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి గెలుపు కోసం నారీశక్తి నడుం బిగించాలని కొండా విశ్వేశ్వర్ రెడ్డి సతీమణి, అపోలో డైరెక్టర్ కొండా సంగీతారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం శేరి లింగంపల్లి లోని సంధ్యా కన్వెన్షన్ లో రంగారెడ్డి జిల్లా బిజెపి మహిళా మోర్చా ప్రతినిధులతో జరిగిన నారిశక్తి కార్యక్రమంలో సంగీతారెడ్డి ప్రచారం జోరు పెంచేందుకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సంగీతారెడ్డి మాట్లాడుతూ... స్థానికంగా ఉన్న ప్రతి ఓటరును కలుసుకొని కమలం గుర్తుకు ఓటు వేసే విధంగా క్షేత్రస్థాయిలో మహిళ ప్రతినిధులు పనిచేయాలన్నారు. చేవెళ్లలో బిజెపి ఘన విజయం సాధించటం ఖాయం అని అయితే మరింత మెజార్టీ కోసం బిజెపి నాయకులు, కార్యకర్తలు మహిళా నాయకురాళ్లు బాధ్యతగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి బూతుకు 370 ఓట్లు బిజెపికి వచ్చే విధంగా ఇంటింటికి తిరుగుతూ ప్రజలను కమలం గుర్తుకు ఓటు వేసే విధంగా పనిచేయాలన్నారు.



కొత్తకోట లో ఇంటింటికి ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

## కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదలకు న్యాయం

### కొత్తకోట మున్సిపాలిటీ 13 వ వార్డులో కాంగ్రెస్ ప్రచారం

కొత్తకోట, మే9(ప్రభాత ఉదయం) కాంగ్రెస్ ప్రభుత్వం హాయంలోనే పేదలకు న్యాయం జరుగుతుందని వేముల శ్రీనివాస్ రెడ్డి అన్నారు . గురువారం కొత్తకోట మండల , మున్సిపాలిటీలో ఎమ్మెల్యే జి ఎం ఆర్ సూచనతో 13వ వార్డులో 232 బుత్ లో గడపగడపకు కాంగ్రెస్ నాయకులు తిరుగుతూ హస్తం గుర్తుకు ఓటేసి ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచందర్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వేముల శ్రీనివాస్ రెడ్డి, పాపయ్య గారి కృష్ణారెడ్డి, మండల సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గొల్ల బాబన్న, కౌన్సిలర్ రామ్మోహన్ రెడ్డి, పి మోహన్ రెడ్డి, పి మాధవ రెడ్డి, గౌతమ్ రెడ్డి, కొట్టం శివకుమార్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, ఎండి మతిన్, ఎండి కైసర్, వహీద్ తదితరులు ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు.



ఇంకుడు గుంతల పై ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జలమండలి రెవెన్యూ డైరెక్టర్ వి ఎల్ ప్రవీణ్ కుమార్

## ప్రతి ఇంటి యజమాని ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలి

### జలమండలి ఎండి సుదర్శన్ రెడ్డి.. ఇంకుడు గుంతల నిర్మాణంపై ఎండీ సమీక్ష

హైదరాబాద్, మే9(ప్రభాత ఉదయం) నగరంలోని ప్రతి ఇంటి యజమాని ఇంటి ఆవరణలో విధిగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని జలమండలి ఎండి సుదర్శన్ రెడ్డి గురువారం వాటర్ ట్యాంకర్ల డిమాండ్ అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఇంకుడు గుంతల నిర్మాణం కోసం జలమండలి చేస్తున్న సర్వే కొనసాగుతోందని ఎండీ సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఇంకుడు గుంతల సర్వేపై ఆయన ప్రధాన కార్యాలయంలో గురువారం సమీక్షించారు. ఈ వేసవిలో నగరంలోని దాదాపు 30 వేలకు పైగా కుటుంబాలు అధికంగా వాటర్ ట్యాంకర్లు బుక్ చేసుకున్నారన్నారు. దీనికి కారణం వారి ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటిపోవడమే అని చెప్పారు. ఆ ప్రాంతాల్లో మళ్లీ ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా ఉండేందుకు మొత్తం 18 స్వచ్ఛంద సంస్థల ద్వారా జలమండలి ఇంకుడు గుంతల సర్వే చేపట్టిందన్నారు. ఈ స్వచ్ఛంద సంస్థలకు చెందిన ప్రతినిధులు ఇప్పటికే 2500లకు పైగా కుటుంబాల్లో ఇంకుడు గుంతల నిర్మాణంపై సర్వే చేశారని తెలిపారు. వీరంతా ఆయా కుటుంబాలకు ఇంకుడు గుంతల నిర్మాణం ఆవశ్యతక, అవగాహన కల్పించారని పేర్కొన్నారు. ఈ వివరాల్ని ప్రత్యేక యాప్ లో నమోదు చేశారని వివరించారు. ఈ సమీక్షలో రెవెన్యూ డెరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్, ఇంకుడు గుంతల ప్రత్యేకాధికారి జాల సత్యనారాయణ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



కని మెట్ట గ్రామంలో మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర్ రెడ్డి కి స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

## ఆరు గ్యారంటీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

### మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర్ రెడ్డి

### ఉద్యమనేత కేసిఆర్ నాయకత్వాన్ని ప్రజలు కోరుతున్నారు

కొత్తకోట, మే9(ప్రభాత ఉదయం) ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీల పథకాలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని దీంతో పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఉద్యమనేత కేసిఆర్ నాయకత్వాన్ని మరోసారి కోరుకుంటున్నారని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. గురువారం పార్లమెంట్ ఎన్నికల ప్రచారం సందర్భంగా కొత్తకోట మండలంలోని కనిమెట్ట గ్రామ నాయకులు, కార్యకర్తలు తెలంగాణ రాష్ట్ర దేవరకద్ర నియోజకవర్గం మొదటి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి ప్రచారానికి వచ్చిన సందర్భంగా ఘన స్వాగతం పలికినారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ... అభివృద్ధి, పేద ప్రజల సంక్షేమ పథకాలు అమలు చేయడంలో మాజీ సీఎం కేసీఆర్ తోనే సాధ్యమవుతుందన్నారు. ప్రజలు ఆలోచించి కారు గుర్తుకు ఓటు వేసి మన్నే శ్రీనివాస్ రెడ్డిని ఎంపీగా ఎన్నుకోవాలని కోరారు. అనంతరం నర్మదా నది పుష్కరాలు సందర్భంగా ఓంకారేశ్వర్, ఉజ్జయిని శ్రీ మహంకాళేశ్వర స్వామి శేష వస్త్రం,కంకణంతో ఎంపీపీ గుంత మౌనిక మల్లేష్ మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర్ రెడ్డి ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్, గ్రామ అధ్యక్షులు , మాజీ వార్డు మెంబర్లు ,మండల నాయకులు ,గ్రామ నాయకులు ,పాల్గొన్నారు.



## ఇండియా కూటమి కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డిని గెలిపించండి

### సీపీఎం పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇంఛార్జి ఐలాపురం రాజశేఖర్

కూకట్‌పల్లి,మే 9 (ప్రభాత ఉదయం) బాలానగర్ లోని చరబండ రాజు కాలనీ లో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఇంటిటికీ కరపత్రాలు పంచుతూ ఈ పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి ఎంపీ గా పోటీ చేస్తున్న ఇండియా కూటమి అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డి నీ గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ కూకట్ పల్లి నియోజకవర్గ ఇంచార్జి ఐలాపురం రాజశేఖర్ పాల్గొని ఆయన మాట్లాడుతూ మే 13న జరిగే పార్లమెంటు ఎన్నికల్లో బిజెపి దాని మిత్రపక్షాలను ఓడించాలని సిపిఎం పార్టీ విజ్ఞప్తి చేస్తుందని, హస్తం గుర్తుకు ఓటు వేసి సునీత మహేందర్ రెడ్డిని గెలిపించాలని కోరారు. పదేండ్ల మోడీ పాలన ప్రజల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైంది. ఎమర్జెన్సీ ని మించిన నియంతృత్వ పోకడలు పోతున్నది. అని,రాజ్యాంగ మౌలిక సూత్రాలైన ప్రజాస్వామ్యం లౌకిక విలువల మీద దాడి చేస్తుందని అన్నారు, మతం పేరుతో ప్రజల దృష్టిని మరలిస్తు మత ప్రాతిపదిక మీద ప్రజల మధ్య విభజన సృష్టిస్తున్నది అని, ఓటు బ్యాంకు రాజకీయాలకు తెర లేపారని, ఈసారి మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని రద్దు చేసి మతరాజ్యం స్థాపించాలని ప్రయత్నిస్తున్నదని అన్నారు. గత 50 ఏళ్లలో గరిష్ట స్థాయికి నిరుద్యోగం పెరిగింది, పెద్ద నోట్ల రద్దుతో లక్షలాదిమందికి ఉన్న ఉపాధి పోయింది అయినప్పటికీ ఉపాధి హామీ పథకాన్ని పట్టణాలకు విస్తరింప చేయక కేంద్ర ప్రభుత్వం దీని మీద మరింత నీరుగార్చింది, దేశంలో ఆర్థిక అసమదలు పెరిగాయి, ఇప్పటికే 17.46 లక్షల కోట్ల బ్యాంకుల అప్పు ఎగవేసిన బడా బాబులకు మళ్లీ అప్పిచ్చేందుకు మోడీ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని అన్నారు. పేదల స్థితిగతులు మాత్రం మరింత దిగజారుతున్నాయి. దేశంలో నిత్యసరవస్తులు బగ్గుమంటున్నాయి, అవినీతి లేని బీజేపీ అని చెప్పూనే ఎలక్ట్రోలు బాండ్లతో అతిపెద్ద అవినీతి చేసిన బిజెపి ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు హెచ్చరించిన కూడా బిజెపిలో ఏ మాత్రం బుద్ధి మారలేదు ప్రజలు, కార్మికులు బిజెపిని ఓడించి దేశాన్ని రక్షించాలని రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జి .జగన్ పి. శంకర్ పి .రాజు తదితరులు పాల్గొన్నారు.


## అకంప్లీష్ అకాడమీ ప్రారంభించిన జస్టిస్ విజయసేన్ రెడ్డి



శంషాబాద్, మే 9,(ప్రభాత ఉదయం) శంషాబాద్ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన అకంప్లీష్ అకాడమీ ని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి విజయ్ సేన్ రెడ్డి గురువారం ప్రారంభించారు. అకాడమీ చైర్మన్ దేవరంపల్లి బుచ్చిరెడ్డి ఏర్పాటు చేసిన అకాడమీ ని బాల్ టూన్ యూనివర్సిటీ డిప్యూటీ వైస్ ఛాన్సులర్ కొండల్ రెడ్డి. ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎం. హనుమంత రెడ్డి లతో కలసి ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ... నగర శివారులలో అన్ని సౌకర్యాలతో ఐఐటి. నీట్ . సీఏ క్లాట్. కోచింగ్ ను ఇవ్వడానికి వీలుగా దీన్ని ఏర్పాటు చేయడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే విధంగా మెరుగైన విద్యా బోధించాలని సూచించారు. విద్యార్థులకు వ్యాపార దృక్పథంతో కాకుండా సేవా దృక్పథంతో మంచి శిక్షణను ఇవ్వాలని ఆయన సూచించారు. ఇంటర్మీడియట్ తో పాటు ఐఐటీ. నీట్ . మెడిసిన్ తదితర విభాగాల్లో శిక్షణ ఇవ్వడానికి దీన్ని ఏర్పాటు చేసినట్లు అకాడమీ చైర్మన్ దేవరంపల్లి బుచ్చిరెడ్డి తెలిపారు . ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్. టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి. మునిసిపల్ చైర్ పర్సన్ కొలను సుష్మా మహేందర్ రెడ్డి. టిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గణేష్ గుప్తా. మున్సిపల్ పార్టీ అధ్యక్షుడు జూడల వెంకటేష్ గౌడ్. మండల పార్టీ అధ్యక్షుడు కోడిగంటి చంద్రారెడ్డి. పిఎసిఎస్ మాజీ చైర్మన్ ఏనుగు రాజిరెడ్డి. మాజీ ఎంపీపీ చెక్కల ఎల్లయ్య ముదిరాజ్ . మున్సిపల్ మండల ప్రముఖులు నీరటి రాజు ముదిరాజ్. గుర్రం చిన్న అనంతరెడ్డి . మేకల వెంకటేష్ ముదిరాజ్ వైద్యులు వ్యాపారవేత్తలు పాల్గొన్నారు.

## చేవెళ్లలో బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగరడం కాయం

### చేవెళ్లలో కాసానికి జ్ఞానేశ్వర్ ముదిరాజ్ గెలుపు తథ్యం:ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ అధ్యక్షులు జిల్లా గణేష్



కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు కోసం ఇంటింటికి ప్రచారం నిర్వహిస్తున్న బి ఆర్ ఎస్ నాయకులు

కూకట్‌పల్లి,మే 9 (ప్రభాత ఉదయం): చేవెళ్లలో బీఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి కాసానికి కామేశ్వరరావు గెలుపు తధ్యమని ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ అధ్యక్షులు జిల్లా గణేష్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ బలపర్చిన కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు కొరకు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరేకపూడి గాంధీ ఆదేశాలతో గురువారం గడప గడపకు బిఆర్ఎస్ ప్రచారంలో భాగంగా కారుగుర్తుకు ఓటు వేయమని ఆల్విన్ కాలనీ ఫేస్1 విజయనగర్ కాలనీ, నవోదయ కాలనీలలో కాలనీ పెద్దలు అంజిరెడ్డి, రాజీ రెడ్డి స్వరూప, లావణ్య, మంజుల, కాసినాథ్ యాదవ్, చిన్నోళ్ల శ్రీను తదితరులతో కలిసి డివిజన్ మాజీ అధ్యక్షులు జిల్లా గణేష్ పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ప్రజలు చాలా స్పష్టంగా బిఆర్ఎస్ కె సి ఆర్ ప్రభుత్వానికి కచ్చితంగా పట్టం కట్టబోతున్నారని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ అవగాహన రహిత్య నిర్ణయాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాలు వివరిస్తూన్న సందర్భంలో ప్రజలనుండి విశేష స్పందన వచ్చిందని అన్నారు. ఈసారి కచ్చితంగా బీఆర్ఎస్ జెండా ఎగరడం కాయం అని వారు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కట్ట శ్రీను, రవి, రాములు గౌడ్, వెంకటేష్ గౌడ్, జగదీష్, సత్యనారాయణ, లలాన్, సాయి, మల్లేష్, నాగరాజు, కైసర, శ్రీను, సుల్తాన్, సలీం, నస్రీన్, ఏస్ కె బీబీ, గణిత, లక్ష్మి, నాగరాణి, వనజ, లక్ష్మి, తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మల్కాజ్‌గిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్ రెడ్డి భారీ మెజార్టీతో గెలిపించుకోవాలి

### ఏవిబి పురంలో ఇంటింటి పాదయాత్రలో మనీషా రెడ్డి



కూకట్‌పల్లి,మే 9 (ప్రభాత ఉదయం): మల్కాజ్ గిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని కూతురు మనిషా రెడ్డి అన్నారు. మల్కాజ్గిరి పార్లమెంట్,ప్రచారంలో భాగంగా కూకట్‌పల్లి నీయోజకవర్గం, కూకట్ పల్లి డివిజన్,ఏవిబి పురంలో మల్కాజ్గిరి కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి కి మద్దతుగా ఆమె కూతురు మనీషా రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వేంకటేశ్వర రావు తోపాటు ఇంటింటి ప్రచారంలో పాల్గొని పట్నం సునీత మహేందర్ రెడ్డి హస్తం గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి, గొట్టిముక్కల దేశాల్, మోలుగు భీంరావు, మేకల రమేష్, సంజీవరావు, ఆర్ వాసు, కిరణ్, పాపారావు తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీగూడ హౌసింగ్ బోర్డు కాలనీలో ఇంటింటికి ప్రచారం నిర్వహిస్తున్న బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు అడికె రాజు

## ప్రధాని నరేంద్ర మోడీతోనే దేశ ప్రగతి: అధికె రాజు

రాజేంద్రనగర్, మే9(ప్రభాత ఉదయం) ప్రధాని నరేంద్ర మోడీ తోనే దేశ ప్రగతి సాధిస్తుందని భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు అడికె రాజు అన్నారు. గురువారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని లక్ష్మీగూడ వాంబే కాలనీ, బృందావన్ కాలనీలలో బిజెపి నాయకులు హనుమంత్ రెడ్డి తో కలిసి ఇంటింటికి తిరుగుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తూ కమలం గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా అడిగే రాజు మాట్లాడుతూ... చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ముందు ఉంటారని అందుకోసం ప్రజలు ఆలోచించి ఓటు వేయాలన్నారు. బిజెపితోనే దేశ ప్రగతి సాధిస్తుందని గత పదివేల లో కేంద్రంలోని నరేంద్ర మోడీ నాయకత్వంలో ప్రపంచ దేశాలు అబ్బురపరిచే విధంగా దేశాన్ని ప్రగతి పథంలో అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడంతో పాటు పేద ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తూ ముందుకు వెళ్తున్నారన్నారు.



ప్రచార కార్యక్రమంలో ప్రసంగిస్తున్న మాజీ మంత్రి కేటీఆర్

## అన్ని వర్గాల వారికి సమన్యాయం చేసిన ఘనత కెసిఆర్‌దే

### బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

కూకట్‌పల్లి,మే 9 (ప్రభాత ఉదయం) తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ అన్ని వర్గాల ప్రజలను ఏలాంటి భేదభావం లేకుండా సమానంగా చూసుకున్నారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కూకట్ పల్లి నియోజకవర్గం, ఓల్డ్ బోయిన్ పల్లిలో ముస్లిం మైనారిటీల సమావేశంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎంపి అభ్యర్థి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ పాల్గున్నారు. ఈ సందర్భంగా కె.టి.ఆర్. మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటైన 10 సంవత్సరాలలో ముస్లిం మైనారిటీల కోసం ప్రత్యేక బడ్జెట్ ప్రవేశపెట్టింది, ముస్లిం పవిత్రమైన రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలకు తొఫా ఇచ్చాం అని ,ఒక వైపు అభివృధి, మరోవైపు సంక్షేమ పథకాలు ప్రజలు అందించిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేఅని అన్నారు. అంతేకాకుండా కూకట్ పల్లి లో అభివృధి నీ చూసి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును 70 వేల పైచిలుకు ఓట్లతో గెలిపించారని, అన్ని వర్గాల వారికి సమానంగా చూసుకున్న ఘనత తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ మాత్రమే, రాబోయే ఎన్నికల్లో మల్కాజ్ గిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి నీ గెలిపించాలని కోరారు.



ఈర్లదిన్నె గ్రామంలో ఇంటింటికి ప్రచారం నిర్వహిస్తూ హస్తం గుర్తు కు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థిస్తున్న కాంగ్రెస్ నాయకులు

## కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల అభివృద్ధి

### చుక్క చిన్న ఆశి రెడ్డి

అమరచింత, మే9(ప్రభాత ఉదయం) కాంగ్రెస్ తోనే అన్ని వర్గాల అభివృద్ధి జరుగుతుందని అమరచింత మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు చుక్క చిన్న అశి రెడ్డి అన్నారు. గురువారం అమరచింత మండలంలోని ఈర్లదిన్నె గ్రామంలో మేకల వసంత్ రెడ్డి, చుక్క వెంకట్ రెడ్డి ల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మేకల వెంకట్ రెడ్డి,, మేకల అంజి రెడ్డి, చుక్క రంగారెడ్డి, మోరెడ్డి వెంకట్ రెడ్డి, మేకల వెంకట్ రెడ్డి, మోరెడ్డి శ్రీను, మోరెడ్డి వెంకట్రాములు, మోరెడ్డి హనుమంత్ రెడ్డి లు ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ ప్రభుత్వ ఆరు గ్యారెంటీలను ప్రజలకు వివరిస్తూ హస్తం గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా చిన్న ఆశి రెడ్డి మాట్లాడుతూ... సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి ని ముందుకు తీసుకెళ్లడంతో పాటు పేదలకు పథకాలను అమలు చేస్తూ వారి అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు ప్రజలు ఆలోచించి హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

## హమ్మయ్య..... ఊపిరిపీల్చుకున్న ప్రజానీకం

### చిరు జల్లులతో కూడిన వాన.. చల్లబడిన వాతావరణం

### జోగులాంబ గద్వాల్ జిల్లాలో ఈదురుగాలులు

గద్వాల జిల్లా ప్రతినిధి, మే 9(ప్రభాత ఉదయం)భానుడుకు వరుణుడు అడ్డుకట్ట వేశారు..గత నెల రోజులుగా భానుడు తన ఉగ్రరూపం చూపాడు.. ఎటు చూసినా 45 డిగ్రీల పైమాటే.. వడ్డేపల్లి మండలం అత్యధికంగా 46 డిగ్రీల రికార్డు స్థాయి ఉష్ణోగ్రత నమోదైంది.. జిల్లా వ్యాప్తంగా మండలాల్లోనూ ఇదే పరిస్థితి.. జనం మలమలమాడిపోయారు. ఇదేం ఎండరా బాబూ అంటూ ఆపసోపాలు పడ్డారు. ఇళ్లల్లో ఉండేవారు సైతం ఎండను తట్టుకోలేక ఆరాటపడ్డారు. ఎండ వేడిమికి వివిధ రకాల పంటలు వాడిపోయాయి. ఎండ తీవ్రత ఇంకా ఎన్ని రోజులు ఉంటుందోనని రైతులు, ప్రజానీకం ఆందోళన వ్యక్తం చేశారు. ఎప్పుడు ఎండలు తగ్గు తాయా అని ఎదురుచూశారు. అయితే భానుడి ఉగ్రరూపంపై గురువారం తెల్లవారుజామున వరుణుడు నీళ్లు చల్లాడు.. వాతావ రణాన్ని ఒక్కసారిగా చల్లబర్చాడు. చల్లటి వాతావరణం కోసం ప్రజలు ఎదురుచూస్తున్న ప్రజానీకానికి ఈదురుగాలుల రూపంలో వాతావరణం చల్లబడటంతో కాస్త ఉపశమనం కలిగించింది.. బుధవారం రాత్రి మేఘావృతమై ఈదురుగాలులు, తేలికపాటి వర్షం పడటంతో చల్లదనానికి ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. గద్వాల పట్టణంలో తెల్లవారుజామున సుమారు గంటపాటు ఈదురుగాలులు, భారీవర్షం కురిసింది. రోడ్లు జలమయం కావడంతో ప్రజలు, వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. గద్వాల, ధరూర్ మండలాలో మోస్తారు వర్షం కురిసింది. మల్దకల్, గట్టు, కేటిదొడ్డి, మండలాలో తేలికపాటి వర్షం కురిసింది. అలంపూర్ నియోజకవర్గంలో అయిజ,వడేపల్లి, ఎర్రవల్లి మండలాలో పలు గ్రామాలలో తేలికపాటి వర్షం కురిసింది. అలంపూర్, ఉండవెల్లి,మానవపాడు, ఇటిక్యాల, రాజోలీ మండలాలో ఎలాంటి వర్షపాతం నమోదు కాలేదు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.